
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



హఫీజ్‌పాషా లీలలెన్నో..!

ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతి అక్రమాల లీలలెన్నో బయటపడుతున్నాయి. పెళ్లిపేరుతో బయటపడిన ఆయన బాగోతంలో కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.58,330
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,210
3 శాతం జీఎస్టీతో	రూ.5,366
నవర (8 గ్రా)	రూ.42,928

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.5 /23.5

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గాలిలో తేమ 60 శాతం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కాకాణిని కలిసిన మేరిగ



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మేరిగ

నెల్లూరు (సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఏపీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళి ఆదివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు.

శ్రీవారి సేవలో అడిషనల్ కమిషనర్



అడిషినల్ కమిషనర్‌కుకు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏసీ

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం దేవదాయశాఖ అడిషినల్ కమిషనర్ రామచంద్రమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయన్ను దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీవారి పట్టువస్త్రాలను, చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను దేవస్థాన వేద పండితుల ఆశీర్వాదాలు అందుకున్నారు. ఆయన వెంట ఏసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

సోమశిలలో 63.952 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 63.592 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 541 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,920 క్యూసెక్కు లు, ఉత్తరకాలువకు 3, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సగటున 343 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

కండలేరులో46.226 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారానికి 46.226 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210, పిన్నేరు వాగుకు 130, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 120, హైలెవల్ స్లూయిజ్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం


- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశం



విశ్రాంత ఉపాధ్యాయులు, సబ్‌ట్రెజరీ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

నెల్లూరు (బృందావనం): పెన్షనర్లు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకుందామని కోవూరు సబ్‌ట్రెజరీ అధికారి పి.కిరణ్‌కుమార్, పొదలకూరు సబ్‌ట్రెజరీ అధికారి ఎస్‌కే కాలేషా పిలుపునిచ్చారు. నగరంలోని భక్తవత్సల నగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో స్టేట్‌గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ కాలేషా మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 20వ తేదీకి ముందు ఇచ్చిన ఈకేవైసీలను తిరస్కరించి ఫ్రెష్‌గా తీసుకోవాలని ఉత్తర్వులు వచ్చాయన్నారు. సీఎఫ్ఎంఎస్ సమస్యలను వివరించారు. పీపీడీలో ఉండే డేట్ ఆఫ్ బర్త్ మాత్రమే కరెక్ట్ అని, ఇన్‌కమ్ ట్యాక్స్ క్లెయిమ్‌లో పెన్షనర్స్ హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్ చేసుకొన్నట్లైతే వారు ట్యాక్స్ మినహాయింపు పొందేందుకు అవకాశం ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎంగౌస్ మాట్లాడుతూ పెన్షనర్ల డీఏ బకాయిలు, పీఆర్సీ బకాయిలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఈ నెల 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. లేకపోతే పెన్షన్ ఆగిపోయే అవకాశం ఉందన్నారు. ఈకేవైసీకి ఫోన్, ఆధార్ లింక్ తప్పనిసరి చేసుకోవాలన్నారు. అనంతరం 75 ఏళ్ల వయోపరిమితి నిండిన 10 మంది ఉపాధ్యాయులను, సబ్‌ట్రెజరీ అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి, కావలి యూనిట్ అధ్యక్షుడు రమణయ్య, బుచ్చిరెడ్డిపాళెం యూనిట్ అధ్యక్షుడు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతం



ప్రభుత్వ శాఖల్లో అవినీతిపరుల ఆటకట్టించేందుకు ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ పని చేస్తోంది. అయినా అటెండర్ నుంచి ఆఫీసర్ల వరకు అవినీతి వేళ్లూనుకునిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టింది. అవినీతి పరుల సమాచారం, ఫిర్యాదులకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను అమల్లోకి తెచ్చింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పరిపాలనా వికేంద్రీకరణ చేపట్టడంతో దాదాపుగా అవినీతికి అడ్డుకట్ట పడింది. ఇంకా స్వతంత్ర వ్యవస్థలుగా కొనసాగుతున్న కొన్ని శాఖల్లో అవినీతి ఏ మాత్రం తగ్గలేదు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆ శాఖలు కూడా ప్రక్షాళన జరిగే అవకాశం ఉంది.

స్వతంత్ర శాఖల్లో తగ్గని అవినీతి

టోల్ ఫ్రీ నంబర్ 14400 ద్వారా ఫిర్యాదులు

- అధికంగా రెవెన్యూశాఖపైనే..
- గతేడాదిలో ఏసీబీకి 320, ఈ ఏడాది నెల వ్యవధిలో 22
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపాల్టీలు, ఆర్‌అండ్‌బీ శాఖలపై అధికం
- రెండేళ్లలో అవినీతికి పాల్పడిన తహసీల్దార్లపై వేటు
- సస్పెన్షన్లతో రెవెన్యూశాఖను ప్రక్షాళన చేస్తున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రభుత్వ శాఖల్లో సేవలు పొందాలంటే కాసులు కొట్టందే.. ఫైళ్లు కదలని పరిస్థితి ఉండేది. అవినీతిని అరికట్టి, ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో పేదోడి నుంచి సంపన్నుడి వరకు పౌరసేవలు పొందడానికి, ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి అటెండర్ నుంచి ఆఫీస్ సూపర్ బాస్ వరకు ముడుపులు ఇచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి చాలా వరకు తగ్గిందనే చెప్పాలి. ప్రభుత్వ సేవలు ఇళ్ల ముంగిటకే అందేలా వలంటీర్ వ్యవస్థ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయడంతో వివిధ ప్రభుత్వశాఖల ద్వారా అందే సేవలు వీటి ద్వారా రూపాయి ఖర్చు లేకుండా అందిస్తున్నారు. దరఖాస్తు చేసిన వెంటనే ఆన్‌లైన్లో ధ్రువీకరణ పత్రాలు అప్రూవల్ ఇస్తున్న పరిస్థితి ఉంది. ఎక్కడికక్కడే అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమయ్యేలా చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖల్లో అవినీతిని సమూలంగా అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏసీబీ అధికారులతో లింకు కలిపి 14400 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ఇంత చేస్తున్నా కొందరు అవినీతి అధికారుల కక్కుర్తి చేష్టలతో ఆ శాఖలకే మచ్చ తెస్తున్నారు. అయినప్పటికీ ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణాశాఖ, పోలీస్, ఎడ్యుకేషన్, మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, మైనింగ్ తదితర శాఖల్లో ఇంకా అవినీతి ఏ మాత్రం తగ్గలేదని తెలుస్తోంది. 14400 టోల్ ఫ్రీ నంబర్ అందుతున్న ఫిర్యాదులే అందుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అనేక సేవలు స్వేచ్ఛగా అందుతున్నాయి. త్వరలోనే రిజిస్ట్రేషన్ శాఖను సైతం సచివాలయ వ్యవస్థలో విలీనం చేయడం ద్వారా దాదాపు అవినీతికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వ రాబడి కూడా పెరగనుంది. క్రమక్రమంగా మిగతా శాఖల ద్వారా జరిగే లావాదేవీలను సైతం సచివాలయ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా పూర్తిస్థాయిలో అవినీతికి అరికట్టేందుకు దోహదపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేరుగా రంగంలోకి ఏసీబీ

ఏ ప్రభుత్వ శాఖలోనైనా పనులు చేయకుండా ఇబ్బందులకు గురి చేసినా, చేతివాటం ప్రదర్శించినా 114400 టోల్ ఫ్రీకి కాల్ చేస్తే నేరుగా ఏసీబీ అధికారులు వెళ్తోంది. ఆయా జిల్లాల ఏసీబీ అధికారులకు ఆ ఫోన్ కాల్ సంబంధించిన వివరాలు పంపుతారు. వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తారు. ఒక వేళ అధికారులు అవినీతి పాల్పడినట్లు రుజువైతే కేసులు కూడా నమోదు చేస్తారు. గతేడాది 14400 నంబర్‌కు 320 ఫోన్ కాల్స్ వస్తే అందులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపాల్టీ, ఆర్‌అండ్‌బీ, హైయ్యర్ ఎడ్యేకేషన్, పోలీస్‌శాఖలపై అత్యధిక ఫిర్యాదు వచ్చాయి. ఆయా ఫిర్యాదులన్నింటిపైనా ఏసీబీ అధికారలు పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చేశారు. ఈ ఏడాది జనవరి నెలలోనే దాదాపు 22 ఫిర్యాదులు రావడంతో అందులోనూ రెవెన్యూశాఖపైనే పది ఫిర్యాదులు వచ్చినట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు. ఆ శాఖలో భూముల మ్యుటేషన్ నుంచి వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లు ఇలాంటివి పేద వర్గాల ప్రజలు సకాలంలో తెచ్చుకోలేక అధికారులకు, సిబ్బందికి ఎంతో కొంత సమర్పించుకోవాల్సి పరిస్థితి అనివార్యంగా మారింది.

రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

కలెక్టర్ చక్రధర్‌బాబు రెవెన్యూశాఖలో అవినీతి పరుల ప్రక్షాళనకు పూనుకున్నారు. ప్రధాన ఆరోపణలున్న రెవెన్యూ శాఖలో అవినీతికి పాల్పడి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై వేటు వేస్తున్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం నుంచి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా మార్చడం, ప్రభుత్వం ఇచ్చే పరిహారంలో అధికారులే తప్పిదాలు చేసి నిధులు ఆరగించడం వంటి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తున్నారు. గత రెండేళ్లగా పరిశీలిస్తే అవినీతి అధికారులైన లావణ్య, నాగరాజు, హమీద్, ప్రమీల, కాయల సతీష్, స్వాతి, చంద్రశేఖర్‌లను సస్పెండ్ చేశారు. కలువాయి మండలంలోని భూ పరిహారం పంపిణీలో అవినీతికి పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయించారు. మరో అధికారి తప్పు చేయాలన్నా భయపడేలా కలెక్టర్ ప్రక్షాళనకు పూనుకున్నారు.

'నెల్లూరులోని నవలాకులతోటకు చెందిన శేషయ్య 1981లో వృద్ధాప్యంతో చనిపోయారు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి చెందినట్లు పక్కాగా నిబంధనల మేరకు 2014 కార్పొరేషన్ మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. అదే వ్యక్తి 2006లో చనిపోయినట్లు నిబంధనలకు విరుద్ధంగా నెల్లూరురూరల్ తహసీల్దార్ గతేడాది మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఆయన 1981లో చనిపోయే నాటికి 91 ఏళ్లు. 2006లో చనిపోయినట్లు అయితే 130 ఏళ్లు ఫైబడినట్లు లెక్క. అంటే రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు' ఒక్క రెవెన్యూ శాఖలోనే కాదు అనేక ప్రభుత్వశాఖల్లో ఇలాంటి అక్రమ లీలలెన్నో జరుగుతున్నాయి.

బాధితులకు న్యాయం జరిగేలా చేస్తున్నాం

ప్రభుత్వ శాఖల్లో జరిగే అవినీతిపై టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఫిర్యాదుదారులతో మాట్లాడి సంబంధిత అధికారులను హెచ్చరిస్తున్నాం. ఏదైనా అవినీతి జరిగిందని తెలిస్తే కేసులు నమోదు చేసేందుకు కూడా వెనకాడడం లేదు. టోల్ ఫ్రీకి వచ్చే ఫోన్ కాల్స్‌లో అధికంగా రెవెన్యూ పైనే అధికంగా ఉన్నాయి. గతంతో పోల్చి చూస్తే చాలా వరకు అవినీతికి అడ్డుకట్ట పడింది. ఇంకా కొన్ని శాఖల్లో అవినీతి జరుగుతున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. పక్కా ఆధారాలతో వీరి ఆటకట్టించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మోహన్, డీఎస్పీ, ఏసీబీ నెల్లూరు

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ఒకేషనల్‌కు 33, జనరల్‌కు 142 సెంటర్ల ఏర్పాటు
- హాజరుకానున్న 33,152 మంది విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం నుంచి, జనరల్ విద్యార్థులకు ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జరగనున్నాయి. మొత్తం 5 విడతల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఒకేషనల్‌కు 33, జనరల్‌కు 142 సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్స్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 33,152 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 1,575 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1,599 మంది కలిపి మొత్తం 3,174 మంది, జనరల్‌కు సంబంధించి ఎంపీసీ 15,367, బైపీసీ 4611 మంది కలిపి మొత్తం 19,978 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాక్టికల్స్‌కు మొత్తం 90 మంది ఎగ్జామినర్లను నియమించారు. సీసీ కెమెరాల నడుమ ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌ను నాన్ జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. హాల్‌టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు 1800 425 7635 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు. జిల్లాలో విద్యార్థులు ఇబ్బందుల పడుకుండా సమస్యలపై 0861-2320312 నంబరుకు ఫోన్ చేయాలని ఆర్ఐఓ వరప్రసాదరావు తెలిపారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు చెప్పారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు (క్రైమ్): నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొర్లుకట్ట సుందరయ్యనగర్‌కు చెందిన ఓ యువతి నెల్లూరు వేదాయపాళెంలోని ఓ నర్సింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 17న ఆమె కళాశాలకు వెళుతున్నాని ఇంట్లో చెప్పి బయలుదేరిన ఆమె అప్పటి నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు కళాశాల ప్రిన్సిపల్‌ను అడుగగా ఆ రోజు కళాశాలకు కూడా రాలేదని చెప్పారు. దీంతో బాధిత తల్లి ఆదివారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెతో యశ్వంత్ అనే యువకుడు చనువుగా ఉంటున్నాడని, అతనిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహసారథులే పార్టీకి వెన్నెముక



గృహసారథుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: గృహసారథులే వైఎస్సార్‌సీపీకి వెన్నెముక అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నరుకూరు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ గృహసారథుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నదన్నారు. నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి పేదల సంక్షేమానికి పాటు పడుతుందన్నారు. ముఖ్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ స్థాయిలోనే ప్రజల అవసరాలు తీరుస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. రాజకీయాలకు తావులేకుండా పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్నందునే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

వైఎస్సార్‌సీపీ, టీడీపీ పాలనల్లో తేడా ప్రచారం

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయవంతానికి వైఎస్సార్‌సీపీ గృహసారథులే కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని కాకాణి చెప్పారు. ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పన నియమితులైన గృహ సారథులు ఆయా కుటుంబాలను కలిసి ప్రభుత్వం వారికి అందించిన లబ్ధి, ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ ఏడాది మార్చి 20 నుంచి గృహసారథుల ఇంటింటా ప్రచారం మొదలవుతోందన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను, దుష్ప్రచారాలను ప్రతి ఓటరుకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. ఈ క్రమంలో పార్టీ సానుభూతిపరులతో పాటు తటస్తుల అభిప్రాయాలను సేకరించాలన్నారు. టీడీపీ హయాంలో సాగిన నిరంకుశ, నికృష్ట పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ ప్రజారంజక పాలనకు తేడాను ప్రజలకు వివరించాలన్నారు.

జోకేష్ పాదయాత్ర..

టీడీపీ నేత లోకేశ్ చేపట్టిన పాదయాత్ర జోకేష్ పాదయాత్రగా మారిందని కాకాణి ఎద్దేవా చేశారు. యువగళం జనం లేక తిరుగు ప్రయనం అయిందన్నారు. పాదయాత్రలో తన కుమారుడికి హాని ఉందంటూ చంద్రబాబు ఆయన భద్రత కోసంమంటూ 400 మంది వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారన్నారు. లోకేశ్ పాదయాత్రకు ప్రజలు ఎలాగో రావడం లేదనే ఉద్దేశంతోనే కాస్త జనాలు కనిపించేలా తన పెయిడ్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని.. వారే జనమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయితే దౌర్భాగ్యమేమిటంటే డబ్బులిచ్చి ఏర్పాటు చేసుకొన్న ఈ 400 మంది వలంటీర్లలో కూడా ప్రస్తుతం 100 మందికి మించి పాదయాత్రలో లేరన్నారు. కూలిచ్చి ఏర్పాటు చేసుకొన్న వలంటీర్ల సైతం పాదయాత్రకు పంగనామాలు పెడుతున్నారంటే చంద్రబాబు, అతని కుమారుడు పరిస్థితి ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐసనాక రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలత, స్థానిక ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు కావలిరెడ్డి రంగారెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, గూడూరు విష్ణుమోహన్ రెడ్డి, ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులనయుడు, ఆకుల మధు, ఎడిచర్ల శ్రీనివాసులగౌడ్, వేగూరు శ్రీనివాసులు, రాయపు శీనయ్య, ఉడా కిశోర్, ముసలి పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష



పరీక్ష రాసిన అనంతరం కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

- మొదటి పేపర్‌కు 987 మంది, రెండో పేపర్‌కు 999 మంది గైర్హాజరు
- డీకేడబ్ల్యూ, గీతాంజలి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు (క్రైమ్): పటిష్ట భద్రతా ఏర్పాట్ల నడుమ జిల్లాలో ఆదివారం ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నెల్లూరు నగరం, రూరల్ పరిధిలోని 16 పరీక్ష కేంద్రాల్లో 7,835 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన పేపర్-1కు 6,848 మంది హాజరు కాగా 987 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరిగిన పేపర్-2కు 6,836 మంది హాజరైతే 999 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎస్పీ సీహెచ్ విజయారావు పటిష్ట చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. నగరంలోని డీకేడబ్ల్యూ, కోవూరు గంగవరంలోని గీతాంజలి కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ డి. హిమవతి, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు డి. శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి తదితరులున్నారు.

ఉదయం నుంచే హడావుడి

ఉదయం 7.30 గంటల నుంచే అభ్యర్థులతో పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి నెలకొంది. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో నిర్ణీత సమయానికే అధిక శాతం మంది అభ్యర్థులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొందరు అభ్యర్థులు గుర్తింపు కార్డులను మరిచిపోవడంతో పోలీసు అధికారులే తగ్గరుండి ఇళ్లకు పంపి కార్డులు తెచ్చుకునేలా చేశారు. పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లేందుకు ఆటోల కోసం వేచి చూసినా సకాలంలో రాకపోవడాన్ని గమనించిన పోలీసు అధికారులు వారిని స్వయంగా తమ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు చేర్చారు. దీంతో సదరు అభ్యర్థులు పోలీసు అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పక్షుల కేంద్రంలో సందర్శకుల సందడి



పక్షుల కేంద్రంలో గూడబాతుల పిల్లల గుంపు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఆదివారం సందర్శకుల సందడితో నిండిపోయింది. ప్రస్తుతం పక్షి పిల్లలు అన్ని ఎగిరే స్థాయికి చేరుకున్నాయి. వీటి కిలకిలరావాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పక్షుల కేంద్రంలో అందమైన విదేశీ వలస విహంగాలు ఓ వైపు ఆకట్టుకుంటుంటే మరో వైపు పచ్చని చెట్లు, పంట పొలాలు వంటి ఆహ్లాదకమైన వాతావరణం పర్యాటలకును చూపులను కట్టిపడేసింది. సందర్శకుల కోసం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు పక్షుల జీవన శైలి, వాటి ఆహారపు అలవాట్లు తెలియజేసేందుకు ఫారెస్ట్ సిబ్బందితో పాటు, ఓ నేచర్ గైడ్‌ను చెరువు కట్టపై ఉన్న వ్యూ పాయింట్లు వద్ద ఏర్పాటు చేశారు. విహంగాలను దగ్గర వీక్షించేందుకు బైనాకూలర్స్, పర్యాటకులు సేద తీర్చే విధంగా అక్కడక్కడ బెంచీలు వంటివి కల్పించారు. తాగునీటి సౌకర్యార్థం శుద్ధి నీళ్ల సైతం వన్యప్రాణి విభాగం అధికారులు కేంద్రంలో కల్పించారు.

నిమ్మ అధరహో

- బస్తా కాయలు రూ.5 వేలు
- ధరలు మరింతగా పెరిగే అవకాశం



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ మార్కెట్ నెల నుంచే ఊపందుకుంది. వారం రోజులుగా కాయల ధరలు ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం లూజు (బస్తా) ఒక్కటింటికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలికినట్లు వ్యాపారులు చెప్పారు. కిలో రూ.53 నుంచి రూ.63 వరకు ధరలు పెరిగాయి. చలి తీవ్రత తగ్గుముఖం పట్టడం, బయట ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి లేకపోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయి. ఢిల్లీ మార్కెట్‌లో కాయల ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. రానున్న రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. కోవిడ్ సంక్షోభం నుంచి కోలుకున్న తర్వాత నిమ్మ ధరలు ఆశించిన స్థాయిలో ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండేళ్లుగా మార్కెట్ సంక్షోభంలో పడకుండా ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా అన్ని రకాల చర్యలు చేపట్టడం వల్ల నిమ్మమార్కెట్ దెబ్బతినలేదు. ఈ ఏడాది పండు కాయల ధరలు కూడా పెరిగాయి. నాణ్యత కలిగిన పచ్చికాయల (గ్రీన్ కలర్)కు డిమాండ్ బాగా పెరుగుతోంది. అయితే ఫిబ్రవరిలో ధరలు పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఫిబ్రవరిలో ఈ స్థాయిలో ధరలు పలికింది లేదంటున్నారు. నిమ్మ రైతులు గడ్డు రోజులను ఎదుర్కొంటున్న సమయంలో కాయల ధరలు పెరగడం మంచి పరిణామంగా పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి చెస్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

కోవూరు: ఎస్పీఎస్ఆర్ నెల్లూరు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోవూరులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో జరుగుతున్న జిల్లాస్థాయి చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని ఆ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు తెలిపారు. విజేతలకు స్కూల్ ప్రిన్సిపల్ హనుమంతరావు, డీస్ పెంచలబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంటుకు ఆర్బిటర్లుగా సూరం వంశీకృష్ణ, కాకుమూడి స్వాతి, విన్నకోట కిశోర్ వ్యవహరించారు. వేముల ప్రదీప్ పర్యవేక్షించారు.

విజేతలు

అండర్–7 ఓపెన్ విభాగంలో వి.సహస్ర (నెల్లూరు), కె.మురళీశంకర్‌రెడ్డి (నెల్లూరు), అండర్–7 బాలికల విభాగంలో వి.సహస్ర (నెల్లూరు), బీవీ మౌక్తిక (నెల్లూరు), అండర్–9 ఓపెన్ విభాగంలో కె.యశ్వంత్‌కుమార్ (నెల్లూరు), బి.కీర్తన (నెల్లూరు), అండర్–9 బాలికల విభాగంలో బి.కీర్తన (నెల్లూరు), బట్టారం సహస్ర (నెల్లూరు) గెలుపొందారు.

కోలాహలంగా శివాజీ జయంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

నెల్లూరు(బృందావనం): ఛత్రపతి శివాజీ జయంతి ర్యాలీ ఆదివారం నెల్లూరులో కోలాహలంగా సాగింది. ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ వీఆర్సీ మైదానం నుంచి ప్రారంభమైంది. గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్, నర్తకి సెంటర్, కనకమహల్, కొత్తహాల్ సెంటర్ల మీదుగా తిరిగి వీఆర్సీ మైదానం చేరింది. ర్యాలీలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పి.సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, బీఎస్ రంగరాజన్, యశ్వంత్ సింగ్, కేవీ సుబ్రహ్మణ్యం, భువనేశ్వరి ప్రసాద్, పిట్టి సత్యనాగేశ్వరరావు ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ చైతన్య వేదిక తదితర హిందూ సంఘాలకు చెందిన కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శివాజీ చిత్రపటంతో, కాషాయ పతాకాలతో ర్యాలీ సాగింది.

రైలుపట్టాలపై మృతదేహం



కావలి: కావలి రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు యార్డు సమీపంలో రైలుపట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. మృతదేహం మూడో లైన్ మధ్యలో ఉందనే సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులో తిప్ప నుంచి కావలికి వచ్చినట్లుగా ఆర్టీసీ బస్సు టికెట్ లభించింది. అదే విధంగా తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి పల్మనాలజీ విభాగంలో చికిత్స చేయించుకున్న కార్డు ఉంది. అతని వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లాక్ కలర్ జర్కిన్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు కావలి జీఆర్పీ స్టేషన్‌లో సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 111
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 218
లేయర్ చికెన్	: 128



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.63
సన్నవి	: రూ.53
పండ్లు	: రూ.25



హఫీజ్‌పాషా లీలలెన్నో..!

- పేదలకు ఇళ్ల స్థలాలు దక్కకుండా కోర్టు నుంచి స్టే
- గిట్టని వారిపై అక్రమ కేసులు
- నిధులు పక్కదారి మళ్లించినట్లు అనేక ఆరోపణలు
- విచారణ చేపట్టిన వక్ఫ్ బోర్డు అధికారులు



ఏఎస్‌పేట దర్గా ప్రాంగణంలో భక్తులు (ఫైల్)

ఆత్మకూరు: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మ దర్గా పీఠాధిపతి పదవిని, కొందరు వక్ఫ్ బోర్డు అధికారులను అడ్డు పెట్టుకుని హఫీజ్‌పాషా పాల్పడిన ఎన్నో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని వివాహం పేరుతో ఆయన మోసం చేశాడని అక్కడ నమోదైన పోలీస్ కేసుతో బండారం బట్టబయలైంది. ఇప్పటికే అనేకమందిని మోసం చేసి పెళ్లి చేసుకున్నట్లు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ బోర్డు కమిటీ ఆయన్ను పదిరోజుల పాటు పీఠాధిపతి పదవి నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. విచారణ నిమిత్తం కమిటీని ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ భూములకు స్టే

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసి గ్రామాల్లో అర్హులైన పేదలకు 9 అంకణాలు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఏఎస్‌పేట మండలంలోని అక్బరాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 58, హసనాపురం గ్రామంలోని సర్వే నంబర్ 20, జువ్వలగుంటపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 34, చందులూరుపాడులోని సర్వే నంబర్ 213/4, వేల్పులగుంటలో సర్వే నంబర్ 69/8లో భూముల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు మండల రెవెన్యూ అధికారులు అంతా సిద్ధం చేశారు. అయితే అప్పట్లో పీఠాధిపతిగా ఉన్న హఫీజ్‌పాషా ఆ సర్వే నంబర్లలోని భూమి తమ పూర్వీకులవని, వాటిపై హక్కులు తమవేనని కోర్టు ద్వారా స్టే తీసుకొచ్చాడు. దీంతో ఏడాదిన్నర కాలంగా ఆ లేఅవుట్లలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఆ భూములు ప్రభుత్వానికి చెందినవని, రెవెన్యూ అధికారులు ప్రకటించారు. ఈ విషయమై వ్యవహారం కోర్టులో నడుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ సుభద్రను సంప్రదించగా గ్రామాల్లో సదరు భూమి ప్రభుత్వానిదేనని, తప్పుడు రికార్డులను కోర్టుకు చూపి స్టే తెచ్చుకున్నారని, గత చరిత్ర తదితర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.

15 గదులు రూ.40 లక్షలకు..

దర్గా ప్రాంగణంలో భక్తుల విశ్రాంతి కోసం దాతలు రూ.లక్షలు వెచ్చించి కట్టించిన గదులను హఫీజ్ పాషా ఇష్టారాజ్యంగా అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. సంవత్సరం క్రితం ప్రాంగణంలో 15 గదులను తన అనుచరుడికి రూ.40 లక్షలకు అప్పగించాడని చెబుతున్నారు. ఆ నగదు దర్గా అకౌంట్‌లో జమ చేయలేదని, దీనిపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

సీసీ కెమెరాలు ధ్వంసం

హఫీజ్‌పాషాను పీఠాధిపతి పదవి నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గంటల వ్యవధిలోనే దర్గాలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని హఫీజ్ బంధువు ఒకరు మాయం చేశారని ప్రచారం జరుగుతోంది. పలు రికార్డులు కూడా కనిపించడంలేదని ఆరోపణలున్నాయి. పుటేజీ మాయంపై ఎస్సై నరేష్‌ను సంప్రదించగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మసీదు నిర్మాణ నిధులు ఏమయ్యాయి?

దర్గా సమీపంలోని మసీదును పునఃనిర్మించేందుకు ఏడాది క్రితం తొలగించారు. నూతన మసీదు నిర్మాణం పేరిట హఫీజ్‌పాషా హైదరాబాద్, చత్తీస్‌ఘడ్, చెన్నై, కర్ణాటక తదితర ప్రాంతాల్లోని భక్తుల వద్ద డబ్బు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఏడాదిలోపు దర్గా నిధులతో మసీదు నిర్మాణం పూర్తి చేసినట్లు రికార్డులో చూపించారని, వసూలు చేసిన నగదు ఏమైందని స్థానికులు ఆదివారం వక్ఫ్ బోర్డు అధికారులను ప్రశ్నించారు.

అధికారులు విచారణ చేస్తున్నారు

ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతిగా వ్యవహరించిన హఫీజ్ పాషాపై పలు ఆరోపణలు రావడంతో వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారులు ఆయన్ను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అతని మీద వచ్చిన ఆరోపణలను నోట్ చేసి రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఖాదర్ బాషాను విచారణాధికారిగా నియమించారు. ఇంకా ఏవైనా ఆరోపణలు మా దృష్టికి వస్తే సీఈఓకు తెలియజేస్తాం. దర్గా పరిపాలన వ్యవహారం పూర్తిగా వక్ఫ్‌బోర్డు అధికారులే నిర్వహిస్తున్నారు. విచారణ పూర్తయిన అనంతరం చర్యలు తీసుకుంటారు.

– ఖాజా మహమ్మద్ హుస్సేన్, వక్ఫ్ బోర్డు, సూపరింటెండెంట్

అద్దె గదుల పేరుతో దర్జాగా దందా

దర్గా ప్రాంగణంలో నిద్ర చేస్తే మంచిదని భక్తులకు నమ్మకం ఉంది. దీంతో అక్కడ గదులకు డిమాండ్ ఎక్కువ. గతంలో తమ పూర్వీకులు నిర్మించిన 6 గదులు ఎంతో మహిమగలిగినవని, వాటిల్లో నిద్రిస్తే మంచి జరుగుతుందని హఫీజ్ తన ఏజెంట్ల ద్వారా ప్రచారం చేయించి రోజుకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఒక్కో గదికి అక్రమంగా అద్దె వసూలు చేసేవాడని చెబుతున్నారు. ఇంకా ప్రాంగణంలో నిద్రించేందుకు టోకెన్లు జారీ చేసి ఇష్టానుసారంగా నగదు వసూలు చేసేవారని తెలిసింది. హుండీ నగదు విషయంలో కూడా చేతివాటం చూపిస్తుంటారని సమాచారం.



శనివారం దర్గాలో సమావేశమైన వక్ఫ్ బోర్డు అధికారులు తదితరులు

దర్గాను పరిశీలించిన వక్ఫ్ బోర్డు కమిటీ



వివరాలు తెలుసుకుంటున్న వక్ఫ్ బోర్డు కమిటీ, అధికారులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్, దొరసానమ్మ దర్గాను రాష్ట్ర, జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యులు, అధికారులు ఆదివారం పరిశీలించారు. హఫీజ్‌పాషాను పీఠాధిపతి పదివి నుంచి తొలగించగా.. రెండు రోజులుగా సభ్యులు, అధికారులు ఏఎస్‌పేటలోనే ఉండి వివరాలు తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా నగారాఖానా సెంటర్‌లోని పాత భవనాన్ని దర్గా ప్రాంగణంలోని దుకాణాలను, గదులను పరిశీలించారు. వ్యాపారస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సీఈఓ నూరుల్లా మాట్లాడుతూ దర్గా పవిత్రమైన పుణ్యక్షేత్రమని, దానిని ప్రతిఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వారి వెంట బోర్డు జిల్లా అధ్యక్షుడు మీరా, ఉపాధ్యక్షుడు షౌకత్ అలీ తదితరులున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహం తరలింపు
- అనుమానం ఉందని ఫిర్యాదు చేసిన బాధిత తండ్రి
- కేసు దర్యాప్తు చేస్తున్న వేదాయపాళెం పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో చనిపోయింది. భర్త మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా తన స్వగ్రామానికి తీసుకెళ్లాడు. అయితే బాధిత తండ్రి కుమార్తె మృతిపై అనుమానం ఉందని, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తీసుకొచ్చి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారు ఆదివారం వివరాలు వెల్లడించారు.. ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం రామలింగాపురానికి చెందిన శ్రీనివాసులుకు నలుగురు సంతానం. చిన్న కుమార్తె సరస్వతి (29)కి గుడ్లూరు మండలం చెంచురెడ్డిపాళేనికి చెందిన బి.మాలకొండారెడ్డితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి రిత్విక్, ధనుశ్రీ, నిశాంత్ అనే సంతానం ఉన్నారు. మాలకొండారెడ్డి బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడునెలలుగా దంపతులిద్దరూ స్థానిక పడారుపల్లిలో నివాసముంటూ పనులు చేసుకుంటున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల నడుమ విభేదాలున్నాయి. దీంతో సరస్వతి పుట్టింటికి వెళ్లగా తల్లిదండ్రులు సర్ది చెప్పి కాపురానికి పంపారు. ఈనెల 18వ తేదీన మాలకొండారెడ్డి తన భార్య బంధువు బాలిరెడ్డికి ఫోన్ చేసి సరస్వతి ఆత్మహత్య చేసుకుందని తమ గ్రామానికి తీసుకెళ్తున్నామని చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి శ్రీనివాసులు, కుటుంబసభ్యులు చెంచురెడ్డిపాళేనికి వెళ్లారు. కుమార్తె మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

జీజీహెచ్‌కు తీసుకొచ్చి..

కుమార్తె మృతిపై శ్రీనివాసులు మాలకొండారెడ్డిని వివరాలు అడిగాడు. 18వ తేదీ ఉదయం 9 గంటల ప్రాంతంలో కుమారుడు నిశాంత్ ఆరోగ్యం బాగోలేకపోవడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పాడు. తిరిగి ఇంటి రాగా లోపల గడియపెట్టి ఉందని, సరస్వతిని ఎంత పిలిచినా స్పందన లేదు. వెనుకవైపు కిటికీలో నుంచి చూడగా సీలింగ్ హుక్కుకు చీరతో ఉరేసుకుని ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తెరిచి ఆమెను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందిదని మాలకొండారెడ్డి తెలిపాడు. అంబులెన్స్ మాట్లాడుకుని ఊరికి తీసుకొచ్చినట్లు చెప్పాడు. అయితే ఈ విషయం నమ్మేలా లేదంటూ శ్రీనివాసులు స్థానిక పెద్దలతో మాట్లాడి కుమార్తె మృతదేహాన్ని నెల్లూరులోని జీజీహెచ్‌కు ఆదివారం తీసుకొచ్చాడు. సరస్వతి మృతికి భర్తే కారణమని వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి..

- పెన్నా నదిలో వ్యక్తి గల్లంతు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వాసు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు వద్ద ఓ వ్యక్తి పెన్నా నదిలో చేపలు పడుతూ గల్లంతైన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చినిగి రామచంద్రయ్య (32) చేపలు పట్టేందుకు పెన్నా నది వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో గాలం నీటిలో చిక్కుకుందని నీటిలోకి దిగి గల్లంతయ్యాడు. సమీపాన ఉన్న కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని గుర్తించి గ్రామంలో తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్సై సీహెచ్ వాసు నది వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. గజ ఈతగాళ్ల చేత గాలింపు చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

- మరో యువకుడికి తీవ్రగాయాలు



విద్యార్థి మృతదేహం

చేజర్ల: మండల కేంద్రమైన చేజర్ల సమీపంలోని బోడిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చేజర్లకు చెందిన మస్తాన్ ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటున్నాడు. అతని కుమారుడైన షేక్ షర్ఫుద్దీన్ చేజర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతను తన స్నేహితుడైన తిమ్మాయపాళెం గ్రామానికి చెందిన సయ్యద్ యూసఫ్ ఘనీతో కలిసి మోటార్‌బైక్‌పై బోడిపాడు వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో పందులను తరలిస్తున్న ఆల్విన్ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న షర్ఫుద్దీన్ (18) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. యూసఫ్ ఘనీకి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై మరిడి నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మైపాడు బీచ్‌కు పోటెత్తిన జనం



జనసంద్రంగా మారిన మైపాడు తీరం

ఇందుకూరుపేట: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌కు శని, ఆదివారాల్లో జనం పోటెత్తారు. సుమారు 50 వేల మంది వచ్చి ఉంటారని అంచనా. మహిళలు తీరంలో దీపాలు వెలిగించారు. ఆదివారం ఉదయం వేలాది మంది సముద్ర స్నానాలు చేసి సమీపంలో ఉన్న జ్యోతిర్లింగాలయాలు, భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాలకు వెళ్లారు. కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలోఎస్సై చల్లా వాసు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.



బందోబస్తు విధుల్లో ఎస్సై వాసు, సిబ్బంది

మోటార్‌బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడి మృతి



శివ మృతదేహం

సంగం: మోటార్‌బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ర్యాంపు సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం దళితవాడకు చెందిన నక్కా శ్రీనివాసులు, పెంచలమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో పెద్ద కుమారుడు నక్కా వెంకటశివ (19) స్థానికంగా స్వీట్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతను మోటార్‌బైక్‌పై బుచ్చి నుంచి సంగం బయలుదేరాడు. నెల్లూరు సంతపేటకు చెందిన ఓ కుటుంబం కారులో శనివారం సిద్దేశ్వరం వెళ్లింది. తిరిగి సొంతూరికి వెళ్తుండగా వారి కారు ర్యాంపు వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని తొలుత ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. ఆ తర్వాత కారు శివ బైక్‌ను ఢీకొంది. దీంతో అతను రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించగా శివ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. బుచ్చి దళితవాడలో విషాదం నెలకొంది.